దాహం! వెఱ్ఱి దాహం! నోరు పిడచ గట్టుకు పోతూంది. కళ్ళు, కాళ్ళూ, తేలిపోతున్నాయి. పళ్ళు బిగబట్టి, కళ్ళను బలవంతాన విప్పుతూ రిక్షా తొక్కుతు న్నాడు వెంకటరమణ. వీధి కుళాయి కనపడగానే ప్రాణం లేచొచ్చింది. రిక్షా ఆపి కుళాయి తిప్పాడు. ఒక్క బొట్టు కూడ పడలేదు. ఉసూరుమంటూ రిక్షా దగ్గర కొచ్చాడు.

"వెంకటరమణా!" అల్లంత దూరం నుంచి బిగ్గరగా పిలుస్తున్నా రెవరో. కళ్ళ నొకసారి తుడుచుకుని పరకాయించి చూసేలోగా ఆ మనిషి దగ్గరకొచ్చి సైకి లాపాడు.

# కథానిక

# దాహం

డా॥(శ్రీమతి)విజయలక్ష్మి

"ఒరేయ్! డాక్టరు గారు నిన్ను నిల్చున్న పళాన లాక్కు రమ్మన్నారు. దా! దా!!" నిప్పుల్లో నిల్చున్నట్లు వెంకట రమణని తొందర చేసి సైకి లెక్కేసాడు డాక్టరు ప్రభాకర్రావుగారి కాంపౌండర్. నాలుక పీక్కుపోతున్నా మారు మాట్లాడ కుండా రిక్షా ఎక్కాడు వెంకటరమణ.

"ఏంటి పంతులు గారూ? డాక్టరు బా బెందుకు రమ్మన్నాడు?"

"కేసొచ్చింది. నీ గ్రూప్ కావాలంట".

అదీ నా గ్రూప్ రక్తం కావలసి వచ్చేప్ప టికి నన్ను వెదుక్కుంటూ వచ్చాడు. ప్రొద్దున్న చేతిలో పైసా లేక కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలినా తన రక్తం తీసుకోనన్నాడు. ఎప్పుడూ పాతికిచ్చేది, యిరవై రూపాయ లిమ్మన్నా వద్దు పొమ్మన్నాడు. "ఎ. బి. గ్రూప్ ఎప్పుడో గాని అవసరం రాదు. రక్తం తీసుకు న్నాక వారం రోజు ల్లోపల ఉపయోగిం చకపోతే అది నీ నెత్తినో, నా నెత్తినో పోసుకోవాల్సిందే తప్పా మరెందుకూ పనికిరాదు. ఐనా నీ రక్తంలో హీమొ గ్లోబిన్ ఏభయి పర్సెంటు కూడ లేదు, నీ రక్త మెక్కిస్తే ఏం ఉపయోగంరా బాబూ! పైగా ఎక్కడెక్కడ తిరిగి ఛస్తు న్నావో వి. డి. ఆర్. ఎల్. పాజిటివ్ వచ్చింది. నీ రక్తం ఎక్కించి నాడికి ఉపయోగం లేక పోగా లేనిపోని జబ్బులు చుట్టుకుంటాయి" అని విదిలించి పారే సాడు ప్రొద్దున్న.

తన ముఖాన పాతిక రూపాయలు పడేసి వంద రూపాయలు కమ్ముకుంటాడు, రక్తం సీసా. తన లాంటి వాళ్ళ రక్తంతో వ్యాపారం చేసి వేలకు వేలుగడిస్తున్నా యీ డాక్టరు ధనదాహం తీరదు. దాహం! మళ్ళీ తన దాహం గుర్తుకొ చ్చింది వెంకటరమణకు. నోరు తడుపు కుంటే గాని ప్రాణం నిలిచేట్లులేదు.

హాస్పిటల్ దగ్గర బండాపి ముందు పైపు దగ్గరకెళ్ళి దోసెడు నీళ్ళు పట్టి ఆబగా త్రాగాడు. నీళ్ళు లోపల కెళ్ళగానే అగ్గిలో నెయ్యి పోసినట్లయింది. నొప్పితో మెలికలు తిరిగిపోయాడు.

"ఒరేయ్! అక్కడ తచ్చిళ్ళాడు తున్నావేంటిరా? దా! దా!" కాంపౌండర్ అదిలించాడు. పొట్ట నొక్కుకుని బాధనాపు కుంటూ కాంపౌండర్ వెకక లోపలికెళ్ళాడు.

వెంకటరమణ ఒంట్లో రక్తం బొట్టు

బొట్టుగా సీసాలో చేరుతూంది. వాలిపోతున్న కళ్ళని విప్పి సీసా వంక చూశాడు. ఉపయోగంలేని రక్తం! జబ్బు లంటించే రక్తం! అయినా ధర వంద రూపాయలు!

పాతిక రూపాయలు తీసుకుని బయటికొచ్చి నెమ్మదిగా రిక్షా యీడుస్తూ ఆలోచిస్తున్నాడు. ఒంట్లో రక్తం అమ్ముకుని యీ డబ్బు సంపాదించాడు. మళ్ళీ అంత రక్తం తన ఒంట్లోకి రావడానికి యీ డబ్బుకు పదింతలైనా చాలదు. అయినా తప్పదు. తనకిప్పుడు అర్జెంటుగా డబ్బు కావాలి. తన చెల్లి తలుపులమ్మకు రాక రాక పదేళ్ళకు కడుపొచ్చింది. పుట్టింటాళ్ళు గర్భదరిద్రులని తెలిసికూడ పుట్టింటి ఆశ చావక పది రోజు లుండి వెళదామని వచ్చింది. దానికి బలానికి కాస్త మందు, మాకు కొనివ్వకపోతే మానె, కనీసం కడుపునిండా తిండికూడ పెట్టలేక పోతున్నాడు. అది చాలదన్నట్లు నిన్నటినుంచి జ్వరం దానికి.

"ఒరేయ్! రమణా!" ఆలోచనల్లో నించి బయటపడ్డాడు రమణ. పక్కింటి నారాయుడు గబగబా తన వైపు వస్తున్నాడు. వెంటనే యింటి దగ్గర చెల్లమ్మ కళ్ళ ముందు నిలిచి, అప్పటిదాకా చిన్నగా అరుస్తున్న పేగులు వేగంగా కదిలి పొట్ట చేత్తో పట్టుకుని విలవిల లాడాడు.

"ఒరేయ్! చప్పున పదరా! నీ కోసం రెండు గంటల్నుంచి తిరుగుతున్నాను. తలుపులమ్మకి బట్టలయి పోతున్నాయి. ఆ రక్తం కాలువలు చూసి కళ్ళు బయర్లు కమ్మేసినాయి. పెద్దాస్పటలుకు తీసుకొచ్చాం. ఇదిగో. వెంటనే రక్తం ఎక్కించాలన్చెప్పి రక్తం అర్జంటుగా కొనుక్కురమ్మని యీ సీసా కాస్తంత రక్తం ఏసిచ్చారు." గ్రూపింగుకి, క్రాస్ మేచింగ్‌కి యిచ్చిన బ్లడ్ శాంపిల్స్ రమణ చేతిలో పెట్టాడు నారాయుడు.

ఒక క్షణం మెదడు మొద్దుబారి నట్లయింది. మరుక్షణం పూనకం వచ్చిన వాడిలా డాక్టరు ప్రభాకర్రావు బ్లడ్ బ్యాంకుకు పరిగెత్తాడు రమణ. ఒగరుస్తూ సీసాలిచ్చి డాక్టరుతో విషయం చెప్పాడు. గ్రూపింగ్ చేసి డాక్టరు రమణ వంక జాలిగా చూసాడు.

"నీ చెల్లెలిదీ ఎ. బి. గ్రూపే రమణా! నువ్వు గుమ్మం ఎక్కేముందే నీ రక్తం కొనుక్కున్నవాళ్ళు వెళ్ళిపోయారు."

"బాబూ. మళ్ళీ తియ్యండి. నా ఒంట్లో రక్తమంతా తీసి నా చెల్లెలి కివ్వండి. చప్పున తియ్యండి బాబూ!" రమణ దీనమైన ఏడుపుకి డాక్టర్ కరిగిపోయాడు.

యాంత్రికంగా రక్తం యివ్వడం, తీసుకోవడం తప్ప యీ విషయం గురించి ఎక్కువ లోతుగా ఆలోచించని డాక్టరు తన బ్రతుకు తెరువుకు ముందునుంచి వాడుకుంటున్న సమిధల్లో ఒకడైన రమణ హృదయ విదారకంగా ఏడుస్తూంటే చలించిపోయాడు. "రక్తం మీద వ్యాపారం చెయ్యడం యీ పవిత్ర భారత దేశంలో తప్ప మరెక్కడా లేదు. మిగతా దేశాల్లో మనుషులు రక్తాన్ని దానం చేస్తారు. ఈ దేశంలో మనుషులు రక్తం దానం చేస్తే ప్రాణమే పోతుందని హడలి చచ్చిపోయే మూర్ఖులు. అంచేతే తనలాంటివారు మనుషుల డబ్బు అవసరాన్ని ఆధారంగా చేసుకుని యీ వ్యాపారాన్ని నడిపించేస్తున్నారు.

ఇది తప్పని తెలిసి కూడా యీ పని చెయ్యకపోతేనేం? అని డాక్టరు అంతరాత్మ నిలదీసింది. "యీ సమాజంలో రక్తాన్ని అమ్ముకోవలసిన పరిస్థితి, కొను క్కోక గత్యంతరంలేని పరిస్థితి వున్న న్నాళ్ళు తను కాకపోతే మరొకరు, మరొకరు, యీ వ్యాపారాన్ని సాగిస్తూనే వుంటారు, అప్పుడప్పుడు రక్తదానం చెయ్యడంవల్ల ఆరోగ్యానికేమీ ముప్పు లేదని, పైగా దేహారోగ్యానికి దోహదం చేస్తుందని ప్రజలకి తెలిసి, విరివిగా రక్తదానం చేసే పరిస్థితు లొచ్చేవరకు, మనిషి ఎట్టెడు తిండికోసమో, గ్రుక్కెడు సారా కోసమో రక్తాన్ని అమ్ముకునే పరిస్థితులు మారే వరకు మరో దారి లేదు. నేనొక్క డిని మడిగట్టుకు కూర్చున్నందువల్ల పరిస్థితులు మారవు" అని అంతరాత్మను జోకొట్టాడు డాక్టర్.

"బాబూ అక్కడ నా చెల్లి చావు బ్రతుకుల్లో వుంది. దాని ప్రాణం నిలపండి". డాక్టర్ కాళ్ళమీద పడ్డాడు వెంకటరమణ.

"రమణా! ఇప్పుడు నీ ఒంట్లో రక్తం తీస్తే ఆ అమ్మాయి ఈ రక్తంతో బ్రతకదు సరికదా, ముందు నువ్వు చచ్చిపోతావు."

"నేను చస్తే చచ్చాను. ముందు నా చెల్లి ప్రాణం కాపాడండి బాబూ!"

డాక్టరు కేం చెయ్యాలో వెంటనే తోచలేదు. తనేమీ చెయ్యలేక పోతున్నందుకు బాధగా వుంది. యీ వూళ్ళో మరో బ్లడ్ బ్యాంకు లేదు. జనరల్ హాస్పిటల్లో ఆనవాయితీ ప్రకారం ఎప్పుడూ బ్లడ్ ఉండదు. ఎ. బి. గ్రూప్ డోనర్సులో యింతకు ముందు ఫోనంతా గాలిస్తే పట్టుకోగలిగినది ఒక్క రమణనే. మళ్ళీ వాళ్ళ కోసం మనుషుల్ని పరుగెత్తించినా.... వాళ్ళొచ్చేసరికి ఆ అమ్మాయి యేలా వుంటుందో!.... టైము చాలా విలువైనది.

"రమణా! ఎ. బి. గ్రూప్ లేనప్పుడు బి. గ్రూప్ రక్తం ఎక్కించొచ్చు. ముందు బి. గ్రూప్ క్రాస్‌మేచ్ చేసిస్తాను. తీసుకెళ్ళు. యీలోపు ఎ. బి. గ్రూప్ బ్లడ్ కోసం ప్రయత్నిద్దాం." తనను కరుణించి సాక్షాత్తూ ఆ దేముడే దిగి వచ్చినట్లు డాక్టరు వంక చూశాడు రమణ. యిప్పటిదాకా యీయనెంత కర్కోటకుడను కున్నాడు తను! యీయనకి ధనదాహం అని ఎంతగా తిట్టుకున్నాడు! తను పొరపాటు పడ్డాడు. ఎంత మంచి వాడిలోనూ ఎక్కడో దానవుడు దాగున్నట్లే ఎంత కర్కోటకుడిలో కూడా ఎంతో కొంత మంచి కూడా వుంటుంది. ఆ మంచి బయట కొచ్చే బలమైన ఘటన రావాలి. తను, తనలాంటి వాళ్ళు, డాక్టరు.... అంతా పరిస్థితులకు బానిసలు, యీ వ్యవస్థ చేతిలో కీలు బొమ్మలు ...కాంపౌండర్ని అడిగి మంచినీళ్ళు లీసుకుని నెమ్మదిగా ఒకొక్క గుక్క త్రాగుతున్నాడు వెంకటరమణ. యిందాకటిలా కడుపులో నొప్పి రాలేదిప్పుడు, కడుపు చల్లబడి నట్లయింది.

గ్లాసు ఖాళీ చేసేటప్పటికి డాక్టర్ రక్తం సీసా అందించాడు. కాళ్ళు తేలిపోతున్నా బలవంతాన గుమ్మందాటాడు రమణ.

"ఒరే రమణా; నీ చెల్లెలు కొంప ముంచేసి నాదిరో" అంటూ ఎదురుగా పరుగెత్తుకొస్తున్నాడు నారాయుడు. దబ్బున క్రింద కూలిపోయాడు రమణ. చేతిలో రక్తం సీసా పగిలి, తనలోని రక్తాన్ని భూమ్మీదకు నెట్టి, భూమి దాహం తీర్చింది.